క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుడు



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో వేంచేసియున్న సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కల్యాణ కానుక అందజేత



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని చేపల గడ్డలో నివాసం ఉంటున్న నిరుపేద ముస్లిం యువతి వివాహానికి చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ కల్యాణ కానుక కిట్టుని శుక్రవారం అందజేశారు. ఈసబ్‌బేగ్, ముంతాజ్ బేగంలు తమ కుమార్తె వివాహానికి కల్యాణ కానుక అందించాలని ట్రస్ట్ వ్యవస్థాపకులు చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌బాబులను కోరారు. స్పందించిన శ్రీనివాసరావు, అశోక్‌బాబు వివాహానికి సంబంధించిన కిట్టుని ట్రస్ట్ సభ్యులు మందపాటి దుర్గారావు, డాడీ తదితరుల ద్వారా అందించారు. నిరుపేదల వివాహాల కోసం తమవంతు సహకారం అందిస్తామని డాక్టర్ అశోక్‌బాబు చెప్పారు.

ఏఐఎస్ఎఫ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని కుమ్మరిపాలెంలోని నారాయణ స్కూల్ వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ..ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో ఏఐఎస్ఎఫ్ మహాసభలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వారు తెలియజేశారు. గురజాల నియోజకవర్గ ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ మధు, ప్రెసిడెంట్ సాయి, పట్టణ ప్రెసిడెంట్ చింటూ, సెక్రటరీ సాయి, పట్టణ ప్రెసిడెంట్ వేణు, సీపీఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణ నాయక్, మహిళా సమైక్య నాయకురాలు పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని సెయింట్ ఆన్స్ ప్రేమ నిలయంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్‌చార్జి బి.కృష్ణారెడ్డి, సిస్టర్ కవిత, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, అన్నపూర్ణ, కోటేశ్వరి, కె.శైలజ, డీఈఓ మధు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శావల్యాపురం వాసికి సైబర్ బెదిరింపులు

శావల్యాపురం: సైబర్ నేరగాళ్లు రోజుకో అవతారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన కాకాని నారాయణకు సీబీఐ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ ఓ వ్యక్తి వాట్సప్ కాల్ చేశాడు. నీకూతురు అమెరికాలో ఉందని, డ్రగ్స్ కేసులో పట్టుబడిందని మాటల్లో దించాడు. అదే సందర్భంలో నీ కూతురుతో మాట్లాడతావా అని అడగ్గా నారాయణరావు ఇవ్వండి మాట్లాడుతానన్నాడు. అవతలి వ్యక్తి ఆడపిల్ల ఏడుస్తున్నట్లుగా శబ్దాలు, పోలీస్ సైరన్లు వినిపించాడు. మరికొద్దిసేపట్లో కేసు నమోదు చేస్తారని, 20 సంవత్సరాల పాటు జైలు శిక్ష పడుతుందని సైబరు నేరగాళ్ల బెదరింపులకు పాల్పడ్డాడు. ఈక్రమంలో తాము కేసు లేకుండా చేస్తామంటూ బేరసారాలు ప్రారంభించి గూగుల్‌పే ద్వారా తక్షణమే రూ. 50 వేలు పంపించండి అంటూ హిందీ, ఆంగ్ల భాషలో సైబరు నేరగాడు డిమాండ్ చేశాడు దీంతో సత్వరమే అమెరికాలో ఉన్న తన కూతురుకు వాట్సాప్ కాల్ చేయగా ఇదంతా ఫేక్ న్యూస్ అని, చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సోషల్ మీడియా పోస్టింగ్‌లపై ఫిర్యాదు

నరసరావుపేట: ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టారంటూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.అలెగ్జాండర్ సుధాకర్ శుక్రవారం రాత్రి ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. పోస్టింగ్‌లకు కారణమైన వారితోపాటు మరో ఇద్దరిపై తగు చర్యలు తీసుకోవాలని మహిళా ఎస్ఐకు ఫిర్యాదు అందజేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

చలిపులికి విరుగుడు మంత్రం

- పెరుగుతున్న చలిగాలులతో గజగజ
- ఉత్తర భారతం నుంచి గురజాల మండలానికి తరలివచ్చిన ఉన్ని వస్త్ర వ్యాపారులు
- వీరు విక్రయించే స్వెటర్లు, మఫ్లర్లు, రగ్గులకు స్థానికంగా భలే డిమాండ్
- ప్రస్తుతం అంతగా విక్రయాలు లేవంటున్న వ్యాపారులు



గురజాలలో ఏర్పాటుచేసిన ఉన్ని దుస్తుల దుకాణం

గురజాల: ప్రస్తుతం వర్షాలు తగ్గి చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. సీతాకాలంలో ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరుగుతుంది. చలి నుంచి ఉపశమనం పొందదానికి ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. దీంతో ప్రతి ఒక్కరూ వీటి కొనుగోలు కోసం ఆసక్తి చూపుతుంటారు. ప్రతి ఏటా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి పలువురు ఉన్ని వ్యాపారులు గురజాల నియోజకవర్గానికి చెందిన పలు మండలాలకు వచ్చి నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో ఉన్ని వస్త్రాలను విక్రయిస్తారు. పట్టణాల్లోని పలు కూడళ్లలో దుకాణాలను ఏర్పాటు చేసి వాటిని విక్రయించి ఉపాధి పొందుతారు.

స్థానికంగా మంచి డిమాండ్...

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో తయారు చేసిన ఉన్ని వస్త్రాలకు స్థానికంగా మంచి డిమాండ్ ఉంటుంది. అప్పుడే పుట్టిన చంటి బిడ్డ నుంచి అన్ని వయస్సుల వారికి, స్త్రీలు, పురుషులు అందరికి సరిపడా ఉన్ని వస్త్రాలు వీరి దగ్గర లభిస్తాయి. అదేవిధంగా వర్షాకాలంలో ఉపయోగించే రెయిన్ కోటులు కూడా వీరివద్ద అందుబాటులో ఉంటాయి. శీతాకాలం చలిలో తిరిగితే జలుబు, ఇతర రుగ్మతలు వస్తుంటాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు గాను తల, చెవులు, ముక్కును కప్పుతూ టోపీలు, రగ్గులు, స్వెట్టర్లు విక్రయిస్తారు.

తగ్గిన వ్యాపారులు..

గురజాల నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో గతంలో 20 నుంచి 30 మంది వరకు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందేవారు. కానీ ప్రస్తుతం ఇప్పటికి 10 మంది మాత్రమే దుకాణాలు ఏర్పాటుచేశారు. ఈ నెలాఖరికి మరొక 10 మంది వస్తారని వ్యాపారులు చెబుతున్నారు.

మందకొండిగా విక్రయాలు..



గత పది రోజుల క్రితం దుకాణాలను ఏర్పాటుచేశాం. ప్రస్తుతం అమ్మకాలు మందకొండిగా ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి స్వెటర్లు పలు రేట్లలో అందుబాటులో ఉన్నాయి. చలికి ఉన్ని దుస్తులతో పాటు వర్షాకాలంలో తడవకుండా రెయిన్ కోటులు అందుబాటులో ఉన్నాయి. గతంలో పోల్చితే ఈఏడాది వ్యాపారం బాగా తగ్గింది. చలి తీవ్రత పెరిగితే దుకాణాల వద్ద సందడి వాతావరణం నెలకొంటుంది.

– రామ్ లాల్, మధ్యప్రదేశ్

బేరాలు ఉండటం లేదు..



ప్రస్తుతం చలి తక్కువగా ఉండటం వలన వ్యాపారం పూర్తిగా తగ్గింది. రోజువారి కూలి కూడా రావడం లేదు. చలి పెరిగితే వ్యాపారం బాగుంటుంది. రానున్న రెండు మూడు నెలల్లో వ్యాపారం పెరగవచ్చు. ప్రస్తుతం వ్యాపారం లేదు. ఇబ్బందులు పడాల్సివస్తుంది.

– రాజేష్, రాజస్థాన్

మధుమేహం, బీపీ పరీక్షలు

గురజాల: హెచ్ఐవీ సోకి జీవించేవారు తప్పనిసరిగా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వి.సుధీర్ సూచించారు. స్థానిక వైద్యశాల నందు శుక్రవారం నేషనల్ ఎయిడ్స్ కంట్రోలు ఆర్గనైజేషన్, ఎయిడ్స్ కంట్రోలు సొసైటీ, నాన్ కమ్యూనికబుల్ డిసీజ్, సీడీసీ పెప్ఫార్, షేర్ ఇండియా సహకారంతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా బీపీ , షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్ లెవల్ తెలుసుకోవడం వలన సకాలంలో మందులు వాడి దుష్ప్రభావాలను నివారించవచ్చన్నారు. అందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు వాసు, షేక్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, హెడ్ నర్సు జయ, కౌన్సిలర్ వెంకయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ తదితరులున్నారు.

విద్యార్థులు పోటీతత్వం కలిగిఉండాలి

గురజాల రూరల్: విద్యార్థులు పోటీతత్వం కలిగివుండాలని సీడీపీఓ రుక్సానా సుల్తానా బేగం విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శుక్రవారం బాలలదినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలల హక్కులు గురించి వివరించారు. అనంతరం పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ వై.ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

కొనసాగుతున్న నాగులేరు మరమ్మతులు



నాగులేరులో పొక్లెయిన్‌తో వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం


నాడు పవిత్రం...
నేడు అపవిత్రం

సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

కారెంపూడి: నాగులేరు బాగుచేత పనులను గ్రామ పంచాయతీ శుక్రవారం చేపట్టింది. నాగులేరు బ్రిడ్జికి దక్షిణం వైపు వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు. అలాగే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నాచు, జమ్ము, తూటికాడ లాంటి వాటిని తొలగింపజేస్తున్నారు. నాగులేరుకు పడమర వైపు ఉన్న పార్క్ ప్రాంతాన్ని చదును చేశారు. నాగులేరు పరిసరాల పరిశుభ్రతను రక్షించేందుకు వాచ్‌మెన్‌ను నియమించారు. బస్టాండ్ ప్రాంత వ్యాపారులు కూడా వ్యర్థాలను వాగులో వేయవద్దని వాగులో వేస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే కారెంపూడిని కలుపుతున్న వినుకొండ రోడ్డు, నర్సరావుపేట, దాచేపల్లి, మాచర్ల రోడ్ల వెంట వేసిన వ్యర్థాలను కూడా క్లీన్ చేస్తున్నారు. శనివారం నాగులేరు గంగధారి మడుగును శనివారం శుభ్రం చేయిస్తామని గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ సరస్వతీభాయి పేర్కొన్నారు. అందుకు కూలీలను నియమించామన్నారు. ఇదిలా ఉంటే ఉత్సవాలకు వచ్చే వీరాచారవంతుల సౌకర్యార్థం టాయ్‌లెట్స్ నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. మహిళల వసతి భవనానికి దక్షిణంగా టాయ్‌లెట్స్ నిర్మాణానికి పూనుకున్నారు. ఈ నేపథ్యంలో సెప్టిక్ ట్యాంక్ గుంతను పొక్లెయిన్‌తో తీయించారు. ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపు ప్రాథమిక సౌకర్యాలను కల్పిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే 'నాడు పవిత్రం.. నేడు అపవిత్రం' శీర్షికన మురికి కూపంగా మారుతున్న నాగులేరు దుస్థితిపై ఈ నెల 3వ తేదీని 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో అధికారులు ఉత్సవాలకు చాలా ముందుగానే స్పందించి పనులు చేయడం ప్రారంభించారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



వెల్దుర్తి: గ్రామ పంచాయతీలను అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను తయారు చేసి పథకాలు అభివృద్ధి చేసేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జరిగిన శిక్షణా తరగతులలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలి. వాటిని ఏ విధంగా అమలు చేసుకోవాలనే అంశాల పై సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు శిక్షణా తరగతులు నిర్వహించటం జరిగిందన్నారు. తొలుత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ఘననివాళులర్పించారు. ఈఓపీఆర్డీ మకటలాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన



పిడుగురాళ్ల: పుస్తక పఠనం ఎంతో మెలైనదని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రక్కులు అన్నారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం నాడు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా రెండవ రోజు పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. శాఖ గ్రంథాలయ అధికారి రాజశేఖర్ విద్యార్థులకు మంచి మంచి పుస్తకాల గురించి వివరించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

రెంటచింతల: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక గ్రంథాలయ అధికారి రాయపాటి రాజకిశోర్ అన్నారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా లూథరన్ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులకు పుస్తక పఠన ప్రాముఖ్యత గురించి వివరించి, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనను విద్యార్థినులు ఆసక్తిగా గమనించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిన్నంటిన అయ్యప్ప శరణుఘోష

నీలకంఠేశ్వర ఆలయంలో వైభవంగా అయ్యప్ప పడిపూజా మహోత్సవం

గురజాల: ఓం శ్రీస్వామియే.. అన్నదాన ప్రభువే శరణమయ్యప్ప అంటూ భక్తులు చేసిన శరణుఘోషతో గురజాల నగర పంచాయతీ పులకించింది. నగర పంచాయతీ పరిధిలోని నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో మహంకాళి నీలం రాజు ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ మహోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప శరణుఘోషతో పట్టణం మార్మోగింది. గురుస్వామి చిలకపాటి బ్రహ్మయ్య కలశ పూజ నిర్వహించారు. మెట్టు మెట్టుకు ఒక్కో మంత్రం పఠిస్తూ కర్పూరంతో పడిని వెలిగించారు. అనంతరం అయ్యప్ప స్వామికి ఛండీహోమం, పాలాభిషేకం, నెయ్యాభిషేకం, చందనాభిషేకం వంటి మొత్తం 12 రకాల అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంపై స్వామివారిని ఉంచి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అయ్యప్పస్వామి భక్తి గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని మండల పరిధిలోని చర్లగుడిపాడులో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న స్వాములు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి



భట్రుపాలెం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

దాచేపల్లి: మండలంలోని భట్రుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్ల శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. కృష్ణానది ఒడ్డున కొలువై ఉన్న స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భట్రుపాలెంతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి చేరుకున్నారు. తొలుత కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. భారీసంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. పలువురు దంపతులు స్వామివారి కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. వేలాది మంది భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదానం చేపట్టారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. దాచేపల్లి నుంచి భట్రుపాలెం వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడిపారు. అదేవిధంగా కార్తిక పౌర్ణమి సందర్భంగా దాచేపల్లిలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. నారాయణపురం, కేసానుపల్లి, తంగెడ, పొందుగల, మాదినపాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి వేడుకలు



సత్రశాల దేవస్థానం ఆవరణలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు


రెంటచింతల: కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో నున్న ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో అర్చకులు చిట్టేల మల్లిఖార్జునశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే భక్తులు పెద్దసంఖ్యలో దేవస్థానం ఆవరణలో కార్తిక దీపాలను వెలిగించారు. ఆయా గ్రామాలలోని భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుడు ఓరుగంటి మారుతీశర్మ నేతృత్వంలో సామూహిక రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతంలో దంపతులు పీటలపై కూర్చుని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం సత్రశాల దేవస్థాంలో, స్థానిక శివాలయంలో కనులపండుగగా జ్వాలాతోరణం నిర్వహించారు.

మాచవరంలో...


మాచవరం: కార్తిక పౌర్ణమి పురష్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. పలు దేవాలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు శివాలయాలకు వెళ్లి పరమ శివుని దర్శించుకొని, పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు కార్తీక పౌర్ణమి విశిష్టతను తెలియజేసారు. భక్తుల రాకతో ఆలయాలు కళకళలాడాయి.

వెండి కిరీటం బహూకరణ...

మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీరేణుకా మహిసాసుర మర్దిని అమ్మవారికి గ్రామానికి చెందిన నెల్లూరి నరసింహారావు రూ1.50లక్షలు విలువ చేసే వెండి నాగపడగ కిరీటాన్ని సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



మోర్జంపాడులో బుగ్గమల్లేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ



చెన్నాయపాలెంలో అమ్మవారికి వెండి కిరీటం అందజేస్తున్న దాత నరసింహారావు

పల్నాటి దైవాలకు నీరాజనాలు



పల్నాటి దైవాలకు హారతులిస్తున్న ప్రజలు



బ్రహ్మనాయుడు విగ్రహానికి పూజలు చేస్తున్న వీరాచారులు

కారెంపూడి: కార్తిక పౌర్ణమినాడు గ్రామోత్సవానికి విచ్చేసిన పల్నాటి దైవాలు (ఆయుధాలు)కు ప్రజలు వారు పోసి కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. వీరుల గుడి నుంచి రాత్రి పది 9 గంటలకు చెన్నకేశవ స్వామి చెంతకు చేరుకుని అక్కడ స్వామి వారి చెంత ఆయుధాలను వాల్చి వీరాచారులు స్వామి ఆశీస్సులు పొందారు. తర్వాత బ్రహ్మనాయుడు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం జ్వాలాతోరణం గుండా పల్నాటి వీర్ల అంకాలమ్మను దర్శించుకున్నారు. అక్కడ నుంచి కోటబురజు మీదగా ప్రధాన రహదారిలో గ్రామోత్సవంగా పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి చేరుకుని ఆయనతో మేళంతో వీరుల గుడికి చేరుకుని అక్కడ పోతురాజుకు పడిగెం కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపు నిదానంపాటి అమ్మవారి తిరునాళ్ల

శావల్యాపురం: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి పుట్ట తిరునాళ్ళ వేడుకలు ఆదివారం నుంచి గ్రామస్తులు దాతలు సహకారంతో వైభవంగా నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు వెల్లడించారు. గత 44 సంవత్సరాల నుంచి ఘనంగా జరుపుతున్నామన్నారు. అదేరోజు ఉదయం భజన కార్యక్రమాలు సాయంత్రం కోలాటం బృందం సభ్యులచే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తిరునాళ్ల పర్వదినం రోజున జలబిందెల కార్యక్రమంలో పాల్గొనే బాలికలు ముందుగా తమ పేర్లను నమో దు చేసుకోవాలన్నా రు. పూజారీ సాయి భరత్ సారధ్యంలో పూజలు నిర్వహిస్తారన్నారు.

ప్రైవేటు స్కూలు బస్సును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఇరువురు విద్యార్థులకు గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు వద్ద ప్రైవేటు స్కూలు బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఇరువురు చిన్నారులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసరావు పేట గీతాంజలి ప్రైవేటు స్కూలు బస్సు విద్యార్థులను ఎక్కించుకుని నరసరావుపేట నుంచి సాతులూరు వైపుకు వస్తున్నది. ఈ క్రమంలో నరసరావుపేట ఆర్టీసీ డిపోకు చెందిన నాన్‌స్టాప్ బస్సు ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూలు బస్సులోని ఇరువురు చిన్నారులు గాయాలపాలయ్యారు. పెను ప్రమాదం తప్పటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.